www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 17 ఆగస్టు 2023
5
తూర్పుగోదావరి

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తాడితోట 33 కెవి ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం గురువారం పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకూ నిలిపివేస్తామన్నారు. రాజమహేంద్రవరం నగరంలోని కొత్తపేట, శ్యామల సెంటర్, టి.నగర్, ఇన్నీస్ పేట, సాయికృష్ణ సెంటర్, స్టేడియం రోడ్డు, ఆదర్శ నగర్, రామకృష్ణ నగర్, తాడితోట, గాంధీపురం, రైల్వే స్టేషన్, ఆల్కట్ గార్డెన్స్, బాలాజీపేట, ఐదుబళ్ల మార్కెట్, శంభునగర్, ఐఎల్‌టిడి సెంటర్, ఆవరోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ప్రయివేటు పాఠశాలల టీచర్ల పాట్లు

- నాలుగేళ్లుగా డిఎస్‌పి ప్రకటించని సర్కారు
- ఎండమావిలా పిఎఫ్, ఇఎస్ఐ, కనీస వేతనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు అరకొర జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక నానా అవస్థలూ పడుతున్నారు. రోజుకు 12 గంటలకు పైగానే ఉపాధ్యాయులు పని చేస్తున్నా పూట గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగం ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు తొలగిస్తారో కూడా తెలియదు. ప్రతి ఏటా అడ్మిషన్ల లక్ష్యం చేరుకోకపోతే యాజమాన్యాలు ఉద్యోగం నుంచి తొలగించడం పరిపాటిగా మారింది. దశాబ్దాల కాలంగా పని చేస్తున్నప్పటికీ అత్యధిక మంది జీవితాల్లో మార్పు కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఉపాధ్యాయులకు భరోసా కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్న విమర్శలున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారు. గడిచిన నాలుగేళ్లలో ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదు. దీనికి తోడుగా ఒక్క డిఎస్‌సి కూడా ప్రకటించకపోవడం ప్రైవేట్ టీచర్ల భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

నాలుగేళ్లుగా డిఎస్‌సి ప్రకటించని సర్కారు

జిల్లాలో 205 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 2,400 మంది ఉపాధ్యాయున్నారని పాఠశాల విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. అత్యధిక మంది బీఈడీలు చేసినవారున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్న ప్రైవేటు రంగంలో రెగ్యులర్ ఉద్యోగాల కోసం దీర్ఘకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. కొందరు వయోభారం మీద పడటంతో కుటుంబాలను పోషించుకోవడానికి ఇతర ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత డిఎస్‌పి నోటిఫికేషన్ ఇవ్వలేదు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాలలు ఒక్కొక్కటే మూత పడు తున్నాయి. కరోనా సమయంలో ప్రైవేటు ఉపాధ్యాయులకు ఉద్యోగాలు పోయి కుటుంబాలు రోడ్డున పడ్డారు. కుటుంబ బాలను పోషించ కోవడానికి కొందరు రోడ్డుపై టీకొట్టు పెట్టు కోవాల్సి వచ్చింది. మరి కొంతమంది ఉపాధ్యాయులు కరోనాకు గురై చికిత్స చేయించుకోవడానికి నగదు లేక మరణించిన ఉదాహరణలున్నాయి.

ఎన్నికల హామీలు బుట్టదాఖలు

ప్రైవేటు ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ఎలాంటి పథకాలు లేవు. వారికి ఆరోగ్య శ్రీకార్డులు లేవు. నవరత్నాల పథకాల్లో ప్రభుత్వం కోత విధించింది. ప్రైవేటు టీచర్లకు పట్టణాల్లో రూ.12 వేలు, గ్రామాల్లో రూ.10 వేల కంటే ఎక్కువ ఆదాయం ఉండటం లేదు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం అన్నీ మర్చిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 'కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు గుర్తించాం.. వైద్యపరంగా ప్రభుత్వం రాగానే అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టి చట్టం చేసి వారికి కనీస వేతనం రెగ్యులర్‌గా వచ్చేలా చూస్తాం.. పని గంటలు, సెలవులు, పిఎఫ్, ఇఎస్ఐ, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి నిబంధనలు వర్తింప చేస్తాం.' అని ఎన్నికల ముందు పాదయాత్రలో అప్పటి ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక ఆ సంగతి మర్చిపోయారు. దీంతో ప్రైవేట్ ఉపాధ్యాయులు ప్రభుత్వ తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాలనా సంస్కరణలతో పాలన చేరువ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

సంక్షేమ పథకాల ప్రయోజనాలను నేరుగా ప్రజల ఇంటి వద్దకే అందించే క్రమంలో సచివాలయ, వాలంటరీ, ఆర్‌బికె వంటి వ్యవస్థలను ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చారని జిల్లా ఇంఛార్జి మంత్రి బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో అనపర్తి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా, మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 10 అంశాల అజెండా అంశాలుగా ఉపాధి హామీ, విద్య, హౌసింగ్, ప్రాధాన్యత భవనాలు, ఇళ్ల స్థలాలు, ఎపి టిడ్కో, వ్యవసాయ అనుబంధ రంగాలు, జలవనరులు, వైద్య ఆరోగ్యం, ఆర్డబ్ల్యుఎస్ పౌర సరఫరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం మరింతగా దృష్టి కేంద్రీకరించి సహేతుకమైన నిర్ణయాలకు చక్కటి అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆశయాల సాధనకు కృషి చెయ్యడం కోసం అందరం కలిసి పని చేయాల్సి ఉందన్నారు. మెరుగైన పరిపాలన, వ్యవసాయం, ఆరోగ్యం తదితర అంశాలపై దృష్టి పెట్టి, వాటిని పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సమగ్రంగా సమీక్షకు ఇది ఒక వేదిక అన్నారు. ఆయా పనుల పెండింగ్‌లపై సమస్య మూలాలపై చర్చించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుందన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎంఎల్ఎ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడారు. జెసి ఎన్.తేజ్ భరత్, సిపిఒ ఎ.ముఖలింగం, వ్యవసాయ శాఖ అధికారి, ఎస్.మాధవరావు, డిహెచ్ఒ, హౌసింగ్ డిహెచ్ఒ పరశురామ్, డిఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఉద్యాన వన శాఖ వి.రాధాకృష్ణ, ఎస్‌జిటి సత్య గోవింద్, కె.విజయ కుమారి పాల్గొన్నారు.

దుళ్లలో చంద్రబాబుకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికాయిన కోనసీమ జిల్లా, మండపేట వెళుతున్న చంద్రబాబు దుళ్లలో ఆగి ప్రజలకు అభివాదం చేశారు. ముందుగా గ్రామంలోని సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నదేవుల వీర వెంకట సత్యనారాయణ (చంటి) నాగలి, వరికుచ్చులను చంద్రబాబుకు అందజేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి, కడియం ఎంపిపి వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, ప్రత్తిపాటి రామారావు చౌదరి, వెలుగుబంటి నాని, ముమ్మిడిదేవి నాగేశ్వరరావు, కాయల సత్యనారాయణ, చిట్టూరి అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు నర్సరీ రైతుల వినతి

చంద్రబాబుకు కడియం నర్సరీ రైతులు వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదలో చంద్రబాబును కలిసిన నర్సరీ రైతులు మొక్కను బహూకరించారు. నర్సరీ రైతులు పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నర్సరీ రైతు మార్గాని సత్యనారాయణ, నర్సరీ అసోసియేషన్ డైరక్టర్లు పిల్లా శ్రీనివాస్, కొండేపూడి నాగు, వడ్లమూరి రాజేష్, బోర్రు వెంకటేశ్వరరావు, కొల్లి శంకర్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై పోస్ట్‌కార్డు ఉద్యమం

పోస్టుకార్డులను ప్రదర్శిస్తున్న పెన్షనర్స్

ప్రజాశక్తి -దేవరపల్లి

ఎపి స్టేట్ గవర్నమెంట్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన సమస్యల పరిష్కారంపై బుధవారం ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు క్యాంపెయిన్ నిర్వహించారు. పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలని, డిఆర్, పిఆర్‌సి బకాయిలు వెంటనే ఒకే దఫాగా నగదుగా చెల్లించాలని, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని, 11వ పిఆర్‌సిలో కోల్పోయిన అడిషనల్ క్వాంటం తిరిగి పునరుద్ధరించాలని, మెడికల్ బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని, పెన్షనర్లకు ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని, హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ కార్డులు పోస్ట్ చేశారు. న్యాయమైన తమ సమ్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు పప్పు వెంకట రామారావు, కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు, కోశాధికారి యలమాటి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు సయ్యద్ అలీ సాహెబ్, ఈడ్పుపుగంటి నాగేశ్వరరావు, పిల్లలమర్రి సత్యనారాయణమూర్తి, వెలిచెర్ల సూర్యనారాయణమూర్తి, సింహాద్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జెడ్‌పి పాఠశాల అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-గోపాలపురం

విరాళం అందిస్తున్న విద్యార్థిని, తల్లిదండ్రులు

పాఠశాల అభివద్ధి కోసం విద్యార్థిని తల్లిదండ్రులు విరాళం అందించడం అభినందనీయమని సర్పంచ్ జొన్నకూటి మణమ్మ అన్నారు. బుధవారం మండలంలోని వాదాలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివద్ధి కోసం పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కొడమంచిలి సూర్య చంద్రం వారి కుమార్తె ప్రసన్న రూ.10,000 నగదు హెచ్‌ఎం విజయ్ కుమార్‌కు సర్పంచ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మణమ్మ మాట్లాడుతూ ఎందరో నిరక్షరాసులను విద్యావంతులను చేసి మేధావులుగా ఉన్నతమైన స్థానంలో నిలబెట్టేందుకు పాఠశాలలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థిని వారి తల్లిదండ్రులు రూ.పది వేల విరాళం అందించడం పట్ల ఉపాధ్యాయులు మానవత మండల చైర్మన్ జొన్నగడ్డ రాంబాబు , గ్రామ పెద్దలు మోహన్, అమ్మన బాబు తదితరులు వారిని అభినందించారు.

పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలు, రోగులకు బుధశారం పండ్లు, రొట్టెలు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు, సభ్యుల ఆధ్వర్యంలో 60 మందికి వీటిని అందించారు. మద్దుల సత్యనారాయణ సాయంతో నిర్వహించినట్లు ఆంజనేయులు తెలిపారు. పోలదాసు శ్రీనివాసరావు, జి.శివ కుమార్, కాళ్ల రాంబాబు, కొత్తపల్లి నాగేశ్వరరావు, జి.రామారావు, సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

త్వరలో ఎకెసి వద్ద పార్కు పూర్తి

రాజమహేంద్రవరం : జెఎన్ రోడ్డుని ఎకెసి కాలేజీ వద్ద పార్కును వినియోగంలోకి తీసుకొని రావాలని కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. పార్కును ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సందర్శకులు కూర్చునేందుకు చేయవలసిన ఏర్పాట్లు త్వరితగతిని పూర్తి చేయాలని ఆదేశించారు. పార్కులో నిర్ధేశించిన ప్రకారం ఆర్నమెంటల్ లైటింగ్ ఏర్పాటు వెంటనే పూర్తి చేయాలన్నారు. సివిల్ వర్కులన్నీ సత్వరమే పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కాపవరం లే-అవుట్ పరిశీలన

కొవ్వూరు రూరల్ : కాపవరం లేఅవుట్‌లో జిల్లా స్థాయి సామూహిక గృహ ప్రవేశాలను నిర్వహించ నున్నామని హౌసింగ్ నోడల్ అధికారి చీఫ్ ఇంజనీర్ జివి.ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కాపవరం హౌసింగ్ లే అవుట్‌ను జిల్లా హౌసింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాకు చెందిన గృహ ప్రవేశాల కార్యక్రమం కాపవరంలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జగనన్న లేఅవుట్‌ను మోడల్ కాలనీగా తీర్చి దిద్దాలని ఆదేశించారు. ఇళ్లు కట్టుకున్న లబ్దిదారులు అందరికీ నిర్మాణ పనులకు చెందిన బిల్స్ అప్లోడ్ చేసి చెల్లింపులు జరపాలని పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం దళితుల ధర్నా

ప్రజాశక్తి-పెరవలి

ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

మండలంలోని అన్నవరప్పాడులో దళితులకు జగనన్న ఇళ్ల స్థలాల మంజూరు చేయలేదని దళితులు, మహిళలు ఎపి ఎంఆర్‌పిఎస్, బిఎస్‌పి, జనసేన పార్టీ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు టి.రాజేశ్వరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దళిత బడుగు బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే దళితులకు ఇంటి స్థలాల పంపకంలో చిన్న చూపు చూశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 180 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు కాగా దళితులు బడుగు బలహీన వర్గాలకు 29 స్థలాలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. దళితులకు ఇళ్ల స్థలాలు శ్మశాన వాటిక సమీపంలో ఇచ్చారని, అగ్రవర్ణాలకు జాతీయ రహదారి పక్కన స్థలాలు ఇచ్చి దళితులపై వివక్ష చూపారని చెప్పారు. గ్రామ పరిధిలో మూడు ప్రాంతాల్లో మూడు చోట్ల గ్రామ కంఠం ఉండగా దళితులు మాత్రం ఉండే ప్రాంతంలో గ్రామ కంఠాన్ని స్వాధీనం చేసుకుని జగనన్న లేఔట్ చేసి ఇంటి స్థలాలు ఇవ్వటానికి 1 1/2 సెంట్లకు రూ.70 వేలు తీసుకుని అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. ఈ భూమి దళితులు బహిర్భూమి ఉపయోగించు కుంటున్నారన్నారు. ఆక్రమణగా ప్లాట్లు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారని తెలిపారు. ఈ భూమిని స్థానికంగా ఉండే దళితులకు ఉపయోగపడే విధంగా రెవెన్యూ అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ భూమిలో స్థానికంగా ఉన్న దళితులు కమ్యూనిటీ హాల్ నిర్మించుకునే విధంగా దళితులకు కేటాయించాలని నాయకులు కోరారు. స్థానికంగా జాతీయ రహదారి పక్కన ఉన్న జగనన్న లే అవుట్స్‌లో మిగిలి ఉన్న 20 ఇంటి స్థలాలు తక్షణం దళితులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కొంతమంది దళితులు డబ్బులు కట్టిన ఇప్పటి వరకు ఇంటి స్థలాలు కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చెట్టే సుజనరావు, బిఎస్‌పి నాయకులు చిర్ర రాజు, జనసేన నేత పిప్పర రవి, స్థానికులు పంతం కృపాకరరావు, కోటిపల్లి నరసింహమూర్తి, రాయ సువార్త, చిన్నారి, వసంత లక్ష్మి, బి.జాన్, పిఎస్. వీరాస్వామి, సిహెచ్.మూర్తి డి.బాబీ పాల్గొన్నారు.

'వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలి'

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్

రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో ఈసారి వైసిపి జెండా ఎగరవేయడమే ప్రధాన లక్ష్యమని పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్ అన్నారు. బుధవారం ధవళేశ్వరంలోని లక్ష్మీ తులసి మెమోరియల్ కన్వెన్షన్ హాల్లో నియోజకవర్గస్థాయి సచివాలయ కన్వీనర్ల సమావేశం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీలు బోస్, భరత్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో సిఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి విజయం సాధించడం ఖాయమన్నారు. అంతరూ ఐక్యంగా చందన నాగేశ్వర్‌ను గెలిపించుకోవాలన్నారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ తనను నమ్మి తనతో నడుస్తున్న ప్రతీ కార్యకర్తకూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, పార్టీ పరిశీలకులు పేరి కామేశ్వరరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, తాటికొండ విష్ణుమూర్తి, తాడాల విష్ణు చక్రవర్తి, కొప్పినీడి రాజమౌళి, ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, దేవుపల్లి సరితా రాణి, చిన్న, దొంతశెట్టి వీరభద్రయ్య పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు పలువురి అభినందన

స్వాతంత్య్ర దినోత్సవాలో ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న అధికారులను పలువురు అభినందించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కడియం మండలంలోని వేమగిరి తోట పాఠశాల తనిఖీకి వచ్చిన ఎంఇఒ లజపతిరాయ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ లజపతిరాయ్‌ను సిడిపిఒ కనకవల్లి, ఎంఇఒ వీరభద్రరావు, ఎంఇఒ-2 ఏడిద నాగేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.జయరాజు, ఉపాధ్యాయులు యాతం నాగమణి, పావని, సతీష్ బాబు పాల్గొన్నారు. **నిడదవోలు** రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బీరా సత్యేంద్ర కుమార్ ఉత్తమ పురస్కారం అందుకున్న నేపథ్యంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి రాజన్‌బాబు, రాజేష్, గారపాటి ప్రసన్న కృష్ణ, యూసఫ్ షాహి, విఆర్ఒ ప్రసాద్, చిట్టి బాబు పాల్గొన్నారు. **తాళ్లపూడి** అవార్డులు అందుకున్న ట్రాన్స్‌కో ఎఇ సిహెచ్.వెంకట్రావు, గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, మానవతా సేవా సంస్థ ప్రతినిధి సింహాద్రి జనార్ధనరావును పలువురు అభినందించారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలో సచివాలయ పరిధిల్లో ఖాళీగా ఉన్న 5 గ్రామ వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఎంపిడిఒ బి.రామ్‌ప్రసాద్ తెలిపారు. మండలంలో చాగల్లు-1లో ఒసి మహిళ, ఊనగట్ల-1లో బిసి బి మహిళ, కవలపల్లిలో ఒకటి జనరల్, ఒకటి నరల్ మహిళ, మార్కొండపాడులో బిసి సి మహిళకు కేటాయించినట్టు చెప్పారు. రిజర్వేషన్ ప్రకారం వయసు 18 ఏళ్లు పైబడి ఆయా గ్రామాలకు చెంది పదో తరగతి వరకు చదివిన వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలు మండల పరిషత్ కార్యాలయంలో తెలుసుకోవాలన్నారు. ఈ నెల 18వ తేదీ సాయంకాలం ఐదు గంటల్లోపు దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా అందజేయాలన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి తాళ్లపూడి

వివిధ సేవా సంస్థలు ఉచితంగా అందిస్తున్న కుట్టు శిక్షణ అల్లికలు విభాగాలలో శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా ఎదగాలని తాళ్లపూడి ఎస్ఐ కె.వెంకటరమణ అన్నారు. మండలంలోని పెద్దేవంలో స్వశక్తి సెంటర్ పేరుతో జగతి ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొందిన 35 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించే కార్యక్రమంలో ఎస్ఐ రమణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి గర్రె రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడమే ప్రధాన ధ్యేయంగా తమ ఫౌండేషన్ పని చేస్తోందన్నారు. శిక్షణ అనంతరం అర్హులైన మహిళలకు పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బోడపాటి కాశి, దుగ్గిరాల సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా సహస్రాబ్ది సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-రాజానగరం

ప్రారంభోత్సవంలో పాల్గొన్న లక్ష్మీపార్వతి, తదితరులు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నన్నయ మహాభారత రచన, రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాల సందర్భంగా రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ఘనంగా ప్రారంభమైంది. కేంద్ర సాహిత్య అకాడమీ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథులు వీసీ కొప్పిరెడ్డి పద్మరాజు, సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, తెలుగు సంస్కృత పండితులు శలాక రఘునాథ శర్మ, తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, తెలుగు ప్రాకత, సంస్కృత పండితులు బేతవోలు రామబ్రహ్మం, సాహిత్య అకాడమీ కన్వీనర్ సి.మణాళిని, సదస్సు కన్వీనర్ డాక్టర్ కెవిఎన్‌డి.వరప్రసాద్ సదస్సును ప్రారంభించారు. విసి ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఆదికవి నన్నయ పేరుతో ఉన్న విశ్వవిద్యాలయంలో సహస్రాబ్ది ఉత్సవాలు జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాజరాజనరేంద్రుని ఆస్థాన పండితుడు నన్నయ తన సంకల్పంతో తెలుగు భాషా సాహిత్యాలకు దిశానిర్ధేశం చేశారని చెప్పారు. తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ ఈ నెల 29న గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సం కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ తరుపున కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నందంపూడి శాసనాన్ని ఎంపీ భరత్, లక్ష్మీపార్వతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, సదస్సు కన్వీనర్, డాక్టర్ కెవిఎన్‌డి.వరప్రసాద్, కో కన్వీనర్లు డాక్టర్ తలారి వాసు, డాక్టర్ టి.సత్యనారాయణ, డాక్టర్ డి.లక్ష్మీనరసమ్మ, డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ, డాక్టర్ పి.ఎ.నాయుడు పాల్గొన్నారు.

చాగల్లు జెడ్‌పి స్కూలుకు దాతల సాయం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు జిల్లా పరిషత్ హైస్కూలుకు పలువురు దాతలు సాయం అందించారు. ఎండి నఫీజ్ రూ.15 వేలు, శ్రీరాజరాజేశ్వరి ఎలక్ట్రికల్స్ పవన్ రూ.6 వేలు, విజయగణపతి క్లాత్ షోరూమ్ పృథ్వీరాజ్ రూ.5 వేలు, విద్యార్థుల స్పోర్ట్స్ కిట్స్‌కు ఇంటి బాలకృష్ణవేణీ వీర్రాజు 200 పుస్తకాలు, ఊనగట్లకు అడ్డగర్ల మురళీకృష్ణ రెండు సైకిళ్లు స్కూలుకు విరాళంగా అందజేసినట్లు హెచ్‌ఎం పి.వీర్రాజు, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ముద్రగడ కాళీకృష్ణ భగవాన్ తెలిపారు.

ఎన్‌టిఆర్ కాలనీలో స్వాతంత్ర్య దినోత్సవం

ప్రజాశక్తి-నిడదవోలు

నిడదవోలు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో యూత్ ఆధ్వర్యంలో బుధవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జువ్వల రాంబాబు, ఎంవి నగర్ కౌన్సిలర్ దాకే అనిల్ కుమార్, చెట్టే రామకృష్ణ, కలగర రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జువ్వల రాంబాబు మాట్లాడుతూ ఈ 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస అవకుండా మంచి భవితకు బాటలు వేసుకోవాలని తెలిపారు. క్రీడల ద్వారా శారీరకంగా, మానసికంగా దఢంగా ఉండవచ్చని అన్నారు. ఎంవి.నగర్ వార్డ్ కౌన్సిలర్ దాకే అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ కాలనీ యూత్ ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. చెట్టే రామకృష్ణ మాట్లాడుతూ ఎందరో ప్రాణాల త్యాగ ఫలితమే మనం నేడు అనుభవిస్తున్న స్వేచ్ఛ స్వాతంత్ర్యమన్నారు. అనంతరం పోటీలలో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

16 వ నెంబర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. జగ్గంపేట ఎఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం కిర్లంపూడి మండలం బూరుగుపూడికి చెందిన బత్తిన వీరరాఘవులు(66) ఈ నెల 14న సొంత పనుల నిమిత్తం నడుచుకుని రామవరం వెళ్లాడు. అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ సమయంలో అతన్ని హైవేపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. గాయాలైన వీరరాఘవులును కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మతి చెందాడు. అతని అల్లుడు కోసనం వీర వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

10 లీటర్ల సారతో మహిళ అరెస్ట్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

బ్యాగ్‌లో 10 లీటర్ల నాటుసారాను తరలిస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని రమణయ్యపేట వద్ద బస్ కోసం ఉన్న మహిళను ఏలేశ్వరం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ జి.సతీష్ తెలిపిన వివరాల మేరకు ఏలేశ్వరం మండలం రమణయ్యపేట శివారు బుధవారం ఉదయం బస్ కోసం పెంకే కష్ణకుమారి అనే మహిళ వేచి ఉంది. అనుమానంతో ఆమె బ్యాగును తనిఖీ చేయగా అందులో 10 లీటర్ల సారా ఉందన్నారు. దీంతో ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితురాలని కోర్టుకు తరలిస్తున్నామన్నారు.

యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

ఎస్. యానాంలో మంగళవారం సముద్ర స్నానానికి దిగి గల్లంతైన యువకుని మృతదేహం బుధవారం లభ్యమైందని ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్.కొత్తపల్లి పంచాయతీ రాఘవులు పేటకు చెందిన కొప్పాడి సతీష్(20) మంగళవారం స్నేహితులతో కలిసి ఎస్.యానంలో బీచ్‌కు వెళ్లాడు. స్నానం చేస్తుండగా గల్లంతయ్యాడు. యువకుని మృతదేహం కాట్రేనికోన మండలం చిర్రయానం వద్ద సముద్ర తీరంలో లభ్యమైందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇరువురు మద్యం బాబులు అరెస్టు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న కాకినాడకు చెందిన అమలదాసు ప్రసాద్, వాకలపూడికి చెందిన రాజేష్ కుమార్‌లను అరెస్టు చేసి బుధవారం కోర్టుకు తరలించామని సిఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారన్నారు. ఈ మేరకు ఇరువురి నుంచి రూ.20వేలు అపరాధరుసం వసూలు చేశామన్నారు.

కారు బోల్తా ఘటనలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి గండేపల్లి

గండేపల్లి జాతి రహదారిపై బుధవారం కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. రాజమహేంద్రవరం నుంచి అన్నవరం వైపు వెళ్తున్న కారు ఆర్‌టిసి బస్సులను ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఆ సమయంలో కారులో డ్రైవర్‌తో సహా ఆరుగురు ప్రయాణిస్తున్నారు. వారిలో నలుగురు మహిళలు ఉన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని చూసిన స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు కారులో ఇరుక్కుపోయిన వారిని బయటికి తీశారు. పోలీసులు ఘటనా ప్రాంతాన్ని సందర్శించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసి క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

పాత సామాన్ల చోరీ కి యత్నం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శివాలయం వీధిలో ఒక వృద్ధురాలు నివాసం ఉంటున్న ఇంటిలో ఆరుగురు మహిళలు బుధవారం ఉదయం పాత సామాన్లు చోరీ చేసేందుకు ప్రయత్నించారు. చుట్టుపక్కల వారు చూసి వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో ఇద్దరు మహిళలు పట్టు పడగా మిగిలిన నలుగురు పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువురి మహిళలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కిర్లంపూడిలోని మార్కెట్లో నివాసముంటున్న వీరు ఊరూరు తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకుంటూ వాటిని అమ్ముతూ జీవనం సాగిస్తున్నట్టు భావిస్తున్నారు. వీరిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆదిత్యలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాల బేసిక్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజుల ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసిందని ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి విదేశీ భాషల విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ జి.సువర్ణలక్ష్మి, ప్రొఫెసర్ కె.వెంకట్ రెడ్డి, విజ్ఞాన జ్యోతి కళాశాల నుంచి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆంగ్లభాషా బోధనలో సాంకేతికతను ఏకీకతం చేయడం, ఎడ్యుకేషన్‌లో టెక్నాలజీ తాజా పురోభివృద్ధిపై ఆంగ్లభాషా నిపుణులు అనుభవాలను వివరించారు. వివిధ కళాశాలల నుంచి ఆంగ్ల భాషా బోధన సిబ్బంది పాల్గొన్నారు. డాక్టర్ జెఎం.కాంతితిలక్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ప్రొఫెసర్ టి.నీలిమ సహకారం అందించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- రౌతులపూడి

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పర్వత జానకి దేవి అన్నారు. రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.రాంబాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పసగడుగుల నానాజీ, సత్తిబాబు తదితరులు ఉన్నారు.

పుస్తకాల మోత

- ప్రయివేటు స్కూల్స్‌లో కానరాని 'నో బ్యాగ్ డే'
- చిన్నారులపై బరువు భారం
- అనారోగ్య సమస్యలతో సతమతం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పిల్లల వయసు, వారి చదువుకునే తరగతులకు ఏమాత్రం సంబంధం లేకుండా పుస్తకాల బ్యాగులు అధిక బరువు ఉంటున్నాయని, ప్రయివేటు యాజమాన్యాలు అవసరానికి మించి పుస్తకాలను కొనుగోలు చేయిస్తున్నాయని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారు చెప్పిందే చేయాల్సి వస్తుందని, అధిక బరువు మోయలేక తమ పిల్లలు అనారోగ్యాలు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో సుమారు 550 ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. 1.10 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. పలు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు 12 నుంచి 25 కిలోల కంటే ఎక్కువ బరువున్న పుస్తకాల బ్యాగులను మోసుకుంటూ స్కూళ్లకు వెళుతున్నారు. నిబంధనల ప్రకారం 1 తరగతి విద్యార్థి 750 గ్రాములు, 2వ తరగతి 2 కేజీలు, 3,4 తరగతుల పిల్లలు 3 కేజీలు, 5వ తరగతి 4 కేజీలు, 6 తరగతి 6 కేజీలు, 7వ తరగతి 8 కేజీలు, 8వ తరగతి 10 కేజీలు, 9,10 తరగతుల పిల్లలు 12 కేజీలు మాత్రమే బరువు మోయాల్సి ఉంది.

నో బ్యాగ్ డే అమలుకు మంగళం

పలు ప్రయివేటు యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా రెట్టింపు బరువు మోయిస్తున్నారు. స్కూలు బ్యాగుల బరువును తగ్గించాలని భావించిన ప్రభుత్వం గతంలో ఆయా పాఠశాలల యాజమాన్యాలకు పలు మార్గదర్శకాలు జారీ చేసినా అవేమి పట్టకుండా వ్యవహరిస్తున్నాయి. వారంలో ఒక రోజైనా చిన్నారులకు పుస్తకాలు మోసే బరువును తగ్గించాలని ప్రభుత్వం నో స్కూల్ బ్యాగ్ డేను తీసుకొచ్చి అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వాటిని తుంగలో తొక్కుతూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రతి నెలా మొదటి, మూడో శనివారాల్లో స్కూల్‌కు చిన్నారులు బ్యాగ్ లేకుండా వెళ్లాలని నిర్ణయించి అన్ని విద్యాసంస్థలకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారు. నో బ్యాగ్ డే రోజున ఉపాధ్యాయులు ఆనంద పాఠాలు బోధించేలా ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. ఉదయం నాలుగు తరగతుల్లో నీతి కథల బోధన, చిత్రలేఖనం, నైతిక విలువలు, సేవా కార్యక్రమాలను విద్యార్థులకు వివరించాలి. క్రీడలు,యోగాసనాలపై శిక్షణ, కథలు చదవడం, చెప్పడం, అనుభవాలు పంచుకోవడం, పొడుపు కథలు, పజిల్స్,సరదాగా ఆటలు ఆడించాలి. పాఠశాలల్లో సాగు చేస్తున్న బడితోటలో పాదులు వేయడం,కలుపు తీయడం,పందిరి,ఎరువులు వేయడం వంటి వాటిని అలవాటు చేయాలి. గ్రంథాలయాల్లో పుస్తకాలను చదవడం, వాటిపై చర్చించే అంశాలు నేర్పించాలి.ఆరోగ్య కార్యకర్తలు, మున్సిపల్, వ్యవసాయదారులు, తదితర పెద్దలను పిలిచి పిల్లలతో మాట్లాడించాలి.అయితే పలు యాజమాన్యాలు ఈ కార్యక్రమాన్ని గాలికొదిలేసాయి.ప్రభుత్వ ఆదేశాలను అమలయ్యేలా చూడాల్సిన విద్యాశాఖ అధికారులు దీనిపై పట్టనట్లు వ్యవహారిస్తున్నారు.

అనారోగ్యాలతో సతమతం

శక్తికి మించి బరువుతో పాఠశాలలకు వెళుతున్న పలువురు పుస్తకాల బ్యాగులను మోయలేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నడుం నొప్పితో సహా నరాల బలహీనతకు వయస్సుకు మించి పుస్తకాలు మోయడం ఒక కారణమని వైద్యులు తెలిపారు. దీని వల్ల ఒత్తిడి పెరిగి చదువుపై శ్రద్ధ తగ్గుతుందని, తెలిపారు.

వెన్నెముక సమస్యలు వస్తాయి

ఎదిగే వయసులో చిన్న పిల్లలు అధిక బరువు మోయకూడదు. శక్తికి మించి బరువు మోస్తే వెన్నెముక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఎదుగుదలలో కూడా సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అవసరమైతే తప్ప పుస్తకాల బరువును తగ్గించడం మంచిది.

- డాక్టర్ బి.విజయ్‌శేఖర్, చంటి పిల్లల వైద్య నిపుణులు, పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి

నింబంధలను పాటించేలా చూడాలి

ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలు నో స్కూల్ బ్యాగ్ డేను సక్రమంగా అమలు చేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. పలు యాజమాన్యాలు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ నిబంధనలను అతిక్రమిస్తున్నాయి.

- ఎం.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి

నో స్కూల్ బ్యాగ్ డే అమలు తప్పనిసరి

నో స్కూల్ బ్యాగ్ డేను అమలు చేయాల్సిందే

అన్ని పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నో స్కూల్ బ్యాగ్ డేను కచ్చితంగా అమలు చేసి తీరాలి. నిబంధనలను అతిక్రమించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటాం. ఎటువంటి ఫిర్యాదులు అందిన ఉపేక్షించేది లేదు.

- జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ

200 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వేట్లపాలెంలో శ్రీరామకృష్ణ ధ్యాన మందిరం, శ్రీశారద బాల వికాస కేంద్రం, శ్రీ వివేకానంద ట్యుటోరి యల్స్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 200 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత సాంస్కృతిక వైభవంపై జిల్లా బౌద్ధిక్ ప్రముక్ రవిశంకర్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు కె.సుబ్బారావు, కార్యదర్శి జె.వెంకటరావు, కోశాధికారి ఎన్.వెంకటరమణ, సమితి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లరేవు లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు లయన్స్ క్లబ్‌ను పలు అవార్డులు వరించాయి. జిల్లాలో 60 లయన్స్ క్లబ్బులు ఉండగా 2022 - 23 సంవత్సరానికి జిల్లా గవర్నర్ మోటూరి మంగతాయారు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లా గవర్నర్ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో తాళ్లరేవు లయన్స్ క్లబ్‌కు 20 అవార్డులు వచ్చాయని క్లబ్ అధ్యక్షులు చోడే శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక లయన్స్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిలో ఫీడ్ ది హంగర్(అన్నార్తులకు ఆహారం) సదుపాయాలు కల్పించే కార్యక్రమంలో భాగంగా లయన్ కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ కార్యక్రమం, లయన్ చిట్టూరి కృష్ణ ఆర్య జనని ట్రస్ట్ సేవలకు జిల్లాలో ప్రథమ అవార్డు వచ్చిందన్నారు. ట్రీ ప్లాంటేషన్, డయాబెటిక్ క్యాంపుల నిర్వహణ, రక్తదాన శిబిరాలు, పర్మినెంట్ ప్రాజెక్టులు, ఎల్‌సిఎఫ్ కాంట్రిబ్యూషన్ విభాగాల్లో పలు బహుమతులు అందుకున్నామన్నారు. లయన్స్ క్లబ్ 2022 -23 అధ్యక్షునిగా ఉత్తమ సేవలు అందించినందుకు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక అవార్డు, జిల్లా ప్రస్తుత గవర్నర్ వేలూరి సూర్యనారాయణకు ప్రత్యేక అవార్డు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సామా భగవాన్, పి.రాయపరాజు, ధూళిపూడి వెంకటరమణ, నున్న దత్తు, కట్ట ఆదినారాయణ, నామన నరసింహమూర్తి, ఇందుకూరి సుబ్బరాజు, కృష్ణ, సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

ఘనంగా డెజూర్ ట్రాన్స్‌ఫర్ డే

ప్రజాశక్తి - యానాం

డెజూర్ ట్రాన్స్‌ఫర్‌డేను బుధవారం యానాంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని సంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. ఫ్రెంచ్ పాలిత పుదుచ్చేరి భారత దేశంలో చట్టబద్ధంగా విలీనమైన రోజును డెజూర్ ట్రాన్స్‌ఫర్ డేగా నిర్వహించడం ఆనవాయితీ. యానాం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ పార్కులోని స్వాతంత్ర్య సమరయోధుల స్తూపానికి మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రగాశం, తదితరులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రామకృష్ణ, తాతాజీ, ఆదినారాయణ, రాంబాబు, దుర్గారావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎస్ఐ రమణమూర్తికి సిఎం మెడల్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం ఇచ్చే సిఎం మెడల్‌కు యానాం పోలీస్ శాఖ స్పెషల్ బ్రాంచ్ ఎఎస్ఐగా పని చేస్తున్న కవల రమణమూర్తి(నానాజీ) ఎంపికయ్యారు. ఈ మేరకు పుదుచ్చేరి సిఎం రంగసామి చేతుల మీదుగా పోలీస్ మెడల్‌ను స్వీకరించారు. పుదుచ్చేరి పోలీస్ శాఖలో 34 ఏళ్లుగా అంకితభావం విధులు నిర్వహించినందుకు రమణమూర్తికి ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా రమణమూర్తిని పలువురు అభినందించారు.

ఘనంగా కామిశెట్టి జయంతి

ప్రజాశక్తి - యానాం

మాజీ మేయర్ కామిశెట్టి వేణుగోపాలరావునాయుడు జయంతిని స్థానిక సమాచార శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఫెర్రిరోడ్డులోని ఆయన విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ అరుల్‌ప్రగాశం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రఘునాయగం, సిఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు, రామకృష్ణ, కెఎల్‌వి.ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

జవాన్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం తదితరులు

బిఎస్ఎఫ్ సైనికుడు రవిబాబుకు సత్కారం

ప్రజాశక్తి - యానాం

భారత సైన్యంలో పనిచేసి ఇటీవల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని యానాం వచ్చిన దరియాలతిప్పకు చెందిన కూరాటి రవిబాబును పలువురు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దరియాలతిప్పలో డాక్టర్ కెఆర్.నారాయణన్ ప్రభుత్వ పాఠశాల, గిరియంపేట పెరున్ తలైవార్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రవిబాబును సత్కరించారు. అదేవిధంగా మంగళవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో రవిబాబుకు పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణ, ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్ఎఒ మునిస్వామి అభినందించి, జ్ఞాపికను అందజేశారు.

అతివేగం ప్రమాదకరం : సిఐ దుర్గాప్రసాద్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ట్రోఫీని అందజేస్తున్న సిఐ దుర్గాప్రసాద్ తదితరులు

అతివేగం చాలా ప్రమాదకరమని ఇటీవల కాలంలో జరుగుతున్న బైక్ ప్రమాదాల్లో ఎక్కువ మంది యువత గాయపడటం, మృతి చెందడానికి ఇదే కారణమని సామర్లకోట సిఐ దురాప్రసాద్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సామర్లకోట జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో విఆర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం మెమోరియల్ ఒక్క రోజు క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు మంగళవారం రాత్రి బహుమతి ప్రదానం జరిగింది. దీఇకి ముఖ్య అతిథులుగా సిఐ దుర్గాప్రసాద్, పాగా సీతారామయ్య ట్రస్ట్ అధినేత పాగా సురేష్ కుమార్ హాజరయ్యారు. విజేతగా నిలిచిన చిరుత లెవెన్స్ జట్టుకు రూ.5 వేలు నగదు బహుమతి, షీల్డ్, రన్నర్‌గా నిలిచిన అర్జు లెవెన్స్ జట్టుకు రూ.3 వేల నగదు బహుమతి, షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలు యువతలో మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. స్నేహభావం పెంపొందుతుందన్నారు. అంతేకాకుండా ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడి, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

గడ్డర్ తొలగిస్తే బస్సు నడుపుతాం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట-పిఠాపురం రోడ్డులో సామర్లకోటలో నూతనంగా నిర్మించిన వంతెన వద్ద రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన గడ్డర్‌ను తొలగించి, వంతెనకు ఇరువైపులా ఉన్న గోతులను పూడ్చితే సామర్లకోట - పిఠాపురం ఆర్‌టిసి బస్సును నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని డిపిటిఒ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. సామర్లకోట - పిఠాపురం రోడ్డులో ఆర్టీసీ బస్సు నడపాలని సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై ఆయన స్పందించారు. అడ్డంకులు తొలగించాలని ఇప్పటికే ఆర్ అండ్ బి అధికారులకు సూచించామన్నారు. దీనిపై కలెక్టర్‌ను కలుస్తామని తెలిపారు. సామర్లకోట - పిఠాపురం పట్టణాల మధ్య బస్సు సర్వీస్‌ను రోజులో రెండు సార్లు నడిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఉప ఎన్నికకు జనసేన ప్రచారం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వేట్లపాలెం మేజర్ పంచాయతీకి చెందిన 14వ వార్డుకు సంబంధించి ఈనెల 19న ఉప ఎన్నికకు జరుగనుంది. ఈ ఎన్నికలో బరిలో ఉన్న కాకాడ రవిశేఖర్‌కు మద్దతుగా జనసేన పార్టీ పెద్దాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామి బుధవారం ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుక్కర్ గుర్తుపై ఓటు వేసి రవిశేఖర్‌ను గెలిపించాని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జార్జిపేటలో ఎన్నికల ప్రచార జోరు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 19న జరగనున్న జార్జి పేట పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి పంచాయతీలో ఎన్నికల ప్రచార జోరు ఊపందుకుంది. బరిలో ఉన్న ముగ్గురు అభ్యర్థుల్లో వైసిపి బలపరిచిన రెడ్డి భాగ్యలక్ష్మి, టిడిపి బలపరిచిన గుత్తుల సత్యవేణి ప్రచారంలో దూసుకెళ్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా ఉన్న కానూరి సూర్యావతి ప్రచారాన్ని ప్రారంభించడంతో జార్జిపేట సర్పంచ్ ఎన్నిక రసవత్తరంగా మారింది. స్వతంత్ర అభ్యర్థికి పడే ఓటింగ్ ఎవరికి కీడు చేస్తుందోనని మిగిలిన అభ్యర్థులు మదనపడుతున్నారు.

నళినిప్రియకు ప్రశంసా పత్రం అందజేత

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఉప్పాడ లైబ్రరీ టీచర్ తెలగంశెట్టి నళినీప్రియకు ఉత్తమ సేవా ప్రశంసా పత్రం కలెక్టర్ కత్తికాశుక్లా అందించినట్లు బుధవారం తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం కాకినాడలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సిదిరి అప్పలరాజు, కలెక్టర్ కృతికాశుక్లా, ఎంపీ వంగా గీత, ఎస్‌పి చేతుల మీదుగా ఈ వార్డును అందుకున్నానని తెలిపారు.

నిబద్ధతకు నిలువుటద్దం చంద్రనాయుడు

ప్రజాశక్తి - జగ్గంపేట

నిద్ధదతకు నిలువుటద్దం ప్రిన్సిపల్ చంద్రనాయుడు అని వైఎస్ఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ ఒమ్మి రఘురామ్ అన్నారు. రూసా మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇ.చంద్రనాయుడు మంగళవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి సిదిరి అప్పలరాజు, కలెక్టర్ కృతికాశుక్లా చేతుల మీదుగా ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని బుధవారం సత్కరించారు. జ్ఞాపికను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గొల్లపల్లి శ్రీను, వైఎస్ఆర్ సేవాదళ్ మండల కన్వీనర్ కిలపర్తి వీరబాబు, వైసిపి నాయకులు నీలపల్లి అప్పారావు, దత్తి శ్రీనివాస్, కట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రనాయుడుని సత్కరిస్తున్న రఘురామ్ తదితరులు

In the Court of the II Addl. Senior Civil Judge, Rajahmundry
O.S. No. 753 of 2014

Between:
Lakshmi Suryavathi ...*Plaintiff*
AND
Maddireddi Gangaratnam (died)
Maddireddi Mutyalarao
and Others ...*Defendants*

NOTICE

To:
Maddireddi Devi,
D/o. late Sreenu,
C/o. Maddireddi Seetha,
D.No. 58-12-15,
Sanjeeva Nagar,
Rajamahendravaram.

Take notice that you are hereby summoned to appear before this Honourable court **on 24-8-2023 at 10.30 AM.** Therefore you have to appear before this Honourable court for defending the above case either in person or through your Advocate. Otherwise the above matter will be heard and determined in exparte.

Rajamahendravaram
Dt: 16-8-2023

P.GANESWARA RAO
Advocate for Plaintiff
Rajamahendravaram

మహారాజశ్రీ రాజమండ్రి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
O.S. No. 168/2022

Between:
1. శ్రీమతి అడబాల చక్రమ్మ
2. శ్రీమతి సమ్మితి వీరవెంకట సూర్యకుమారి
3. శ్రీమతి అడబాల వీరవెంకట వరలక్ష్మి
4. శ్రీమతి అడబాల వీరవెంకట రమణ -వాదులు

AND

To:
D-1: శ్రీమతి అడబాల సత్యనారాయణమ్మ @ సత్యవతి W/o. (లేటు) తమ్మారావు, C/o. అంగడి పాపారావు (ఇంటి యజమాని), 19వ డివిజన్, మహాలక్ష్మి నగర్, సత్యవేడ కాలనీ, సంజయ్ నగర్, మేకల కమేలా, కాకినాడ అర్బన్, తూ౹౹గో౹౹జిల్లా.
D-2: అడబాల వీరబాబు, S/o. (లేటు) తమ్మారావు, -do-, -do-.
D-3: అడబాల మణి, S/o. (లేటు) తమ్మారావు, -do-, -do-.
D-4: అడబాల శివ, S/o. (లేటు) తమ్మారావు, -do-, -do-.
D-5: అడబాల సత్యవతి W/o. (లేటు) లక్ష్మణ్, శానిటోరియం ఎదురుగా, కొంతమూరు (V), రాజమండ్రి రూరల్, తూ౹౹గో౹౹జిల్లా.
D-6: అడబాల లోవకుమారి, D/o. (లేటు) లక్ష్మణ్, -do-, -do-. -ప్రతివాదులు

వాదులు దావా షెడ్యూల్ దాఖలా ఆస్తిలో తమకు 1/3వ వంతు వాటా ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసి ఉన్నారు. పై నెంబరు దావాలో 1 నుండి 6 ప్రతివాదులైన మీకు దావా సమన్లు ముట్టి ఉండనందున సదరు దావా సమన్లు పేపరు ప్రకటన ద్వారా జారీ చేయవలసిందిగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చినందున పై నెంబరు దావాలో 1 నుండి 6 ప్రతివాదులైన మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ **ది. 21-08-2023 ఉదయం 10.30 ని౹౹లకు** హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

రాజమండ్రి **జి.వి.రమణమూర్తి**
16-08-23 న్యాయవాది, రాజమండ్రి

పేరు మార్పు

మామిడికుదురు మండలం, మామిడికుదురు గ్రామానికి చెందిన షేక్ ఖాజా కరీం, తండ్రి: షేక్ హుస్సేన్ జానీ తెలియజేయునది ఏమనగా ఇంతవరకు నేను ఖాజా కరీం, తండ్రి: షేక్ హుస్సేన్ జానీ గా పిలవబడగా ఇకపై నా పేరును షేక్ ఖాజా కరీం గా మార్పు చేయడమైనది. కావున యావన్మంది ఈ మార్పును గమనించవలసిందిగా కోరుచున్నాను.

షేక్ ఖాజా కరీం
తండ్రి: షేక్ హుస్సేన్ జానీ
డో.నెం. 1-159, మెయిన్ రోడ్,
మామిడికుదురు, మామిడికుదురు మండలం,
డా౹౹బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ : 80195 03992

పాస్‌పోర్టు మిస్సింగ్

తూర్పు గోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, త్యాజంపూడి గ్రామం కాపురస్తులైన తోడిగంజి అర్జమ్మ, భర్త: వెంకటేశు అను నా ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. **X0829726 (E.C)** గల నా ఒరిజినల్ పాస్‌పోర్టు ది.03-07-2023న త్యాజంపూడి నుండి యర్నగూడెం ఆటోలో వెళ్లుచుండగా జిరాక్సు తీసుకోడానిని దిగి చూడగా నా ఒరిజినల్ **(E.C) X0829726** పాస్‌పోర్టు పడిపోయినది. దొరకిని వారు ఈ క్రింది నెంబరుకి తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

తోడిగంజి అర్జమ్మ
భర్త: వెంకటేశు, త్యాజంపూడి,
దేవరపల్లి మండలం, తూ౹౹గో౹౹జిల్లా.
సెల్: 81795 38823

పత్రికా ప్రకటన

మా క్లయింటు కాకినాడ జిల్లా, యు.కొత్తపల్లి వాస్తవ్యులు **అమరాది పాపారావు గారి కుమారుడు అమరాది మణికంఠ స్వామి** గారు ఇచ్చిన సంజాయిషీపై తెలియజేయునది ఏమనగా..,

మా క్లయింటు ది.22-02-2023వ తేదీన ఈ దిగువ షెడ్యూలు ఆస్థి అమరాది పాపారావు వగైరాలవలన శెటిల్‌మెంటు దస్తావేజు ద్వారా పొందియున్నారు. సదరు పాపారావు గారు వగైరాలు ది.14-09-2006వ తేదీన ముత్య వీరలక్ష్మి గారు ద్వారా క్రయం పొందియున్నారు. సదరు ముత్య వీరలక్ష్మి గార్కి వారి మేనత్త ముత్య సుబ్బమ్మ అనే సుబ్బయ్యమ్మ గారు ది.12-10-1944 తేదీన రిజిష్టరు వీలునామా రిత్యా సదరు ఆస్థి చెంద చేసియున్నారు. సదరు ముత్య సుబ్బమ్మ గారు యొక్క డెత్ సర్టిఫికెట్ అందుబాటులో లేదు. కావున సదరు ఆస్థి పై గాని సదరు వీలునామాపై గాని ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు ఉన్న వెంటనే తెలుపవలెను.

షెడ్యూలు

పూర్వం తూ౹౹గో౹౹ జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, పిఠాపురం సబ్ డివిజన్, యు.కొత్తపల్లి, ఎస్.నెం. 2, డో.నెం. 1-80, అసెస్‌మెంటు నెం.80 గల మోడ్రన్ టెర్రస్ పెంకుటి మేడ ప్రస్తుతం ఖాళీ స్థలం 194-03 చ౹౹గ౹౹ లేక 162.23 చ౹౹మీ౹౹కు హద్దులు:
తూర్పు: 64-00 అ౹౹లు బొడ్డు సూర్య నారాయణ గారి ఇల్లు. **దక్షిణం:** 27-06 అ౹౹లు 12 అడుగుల వెడల్పు గల ఉమ్మడి మార్గం. **పడమర:** 63-0 అ౹౹లు అమరాది సంతోష్ గారి స్థలం. **ఉత్తరం:** 27-06 అ౹౹లు మోకా రాజు గారి ఇల్లు మిగతా మా స్థలం.

పి.ఎం.జయరావు
అడ్వకేట్, పెద్దాపురం. సెల్: 98481 13611

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.పి. నెం. 8 / 2023

Between:
శ్రీ కాళ్ళకూరి నాగేశ్వరరావు వగైరా -పిటీషనర్లు
AND
శ్రీ తీగెల లక్ష్మీనారాయణ వగైరా -రెస్పాండెంట్లు

To:
రెస్పాండెంట్లు:
1) తీగెల లక్ష్మీనారాయణ, తండ్రి: లేటు నాగేశ్వరరావు, వయస్సు 44, మెడికల్ షాప్, డోర్ నెం. 5-50, దేవరపల్లి, దేవరపల్లి మండలం, తూ౹౹గో౹౹జిల్లా.
2) తీగెల పవన్‌కుమార్, తండ్రి: లేటు నాగేశ్వరరావు, వయస్సు 40, మెడికల్ షాప్, డోర్ నెం. 6-19, దేవరపల్లి, దేవరపల్లి మండలం, తూ౹౹గో౹౹జిల్లా.
3) తీగెల హోరా సత్యలక్ష్మి సూర్య కళావతి, భర్త: పవన్‌కుమార్, వయస్సు 33, గృహిణి, డోర్ నెం. 6-19, దేవరపల్లి, దేవరపల్లి మండలం, తూ౹౹గో౹౹జిల్లా.
4) The Official Receiver, West Godavari, District Court Complex, Eluru, Eluru District.

పై నెంబరు ఇంసాల్వెన్సీ పిటీషనులో 1 మరియు 2వ రెస్పాండెంట్లు నుండి పిటీషనర్స్‌కు రావలసిన ప్రోనోటు బాకీ నిమిత్తం పిటీషనర్లు 1 మరియు 2వ రెస్పాండెంట్లు పై కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో O.S. No. 151/2023 దావాను మరియు O.S. No. 190/2023 దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావా ప్రోనోట్లు బాకీ ఎగవేయు దురుద్దేశ్యముతో తనకు గల కొవ్వూరు SRO, దేవరపల్లి రెవిన్యూ గ్రామం తాలూకు రివిజన్ సర్వే నెం. 1304/1 రులో చ౹౹గ౹౹ 154 గల స్థలం, అందలి డోర్ నెం. 6-19 అసెస్మెంటు నెం. 804 ర్లు గల గ్రౌండ్ ఫ్లోర్లుతో వున్న చ౹౹అ౹౹ 1516 లు ప్లింత్ ఏరియా గల ఆర్.సి.సి. బిల్డింగ్ స్థలమును మరియు తూర్పుగోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, కొవ్వూరు SRO, దేవరపల్లి రెవిన్యూ గ్రామం తాలూకు రివిజన్ సర్వే నెం. 1304/1 రులో చ౹౹గ౹౹ 84లు స్థలము అందలి డోరు నెం. 6-18, అసెస్మెంటు నెం. 803 ర్లు గల గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్లుతో ఉన్న చ౹౹అ౹౹ 782 లు ప్లింత్ ఏరియా గల ఆర్.సి.సి. బిల్డింగ్ గల స్థలములు ది. 06-03-2023వ తేదీన దస్తావేజు నెం. 2056/2023 న లాలూచీగా సెటిల్మెంటు దస్తావేజును 2వ రెస్పాండెంట్ 3వ రెస్పాండెంటు పేరన వ్రాయించియున్నారు. కావున 3వ రెస్పాండెబట్ పేరున వ్రాయించి ఇచ్చిన స్థిరాస్తి సెటిల్మెంట్ దస్తావేజును రద్దుపరచి 1 మరియు 2వ రెస్పాండెంట్లును ఇన్సాల్వెంటుగా డిక్లేర్ చేయిచమని పై నెంబరు పిటీషనును దాఖలు చేసియున్నారు.

శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ప్రకారం ఈ నోటీసు ఇవ్వడమైనది. అందు విషయమై ఎవ్వరికైనా ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల **ది. 18-09-2023వ తేదీన ఉదయం 10.30 ని౹౹లకు** శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలియపర్చుకోవచ్చును. లేని యెడల వారి పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది,

వాయిదా: 18-09-2023

ఎం.ఎస్.ఎస్.చక్రపాణి
పిటీషనర్లు తరపు అడ్వకేట్
కొవ్వూరు కొవ్వూరు, తూ౹౹గో౹౹జిల్లా
ది.14-08-2023 సెల్: 9347626845